జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
12 శనివారం, సెప్టెంబర్ 2026 పేజీలు:10






## గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు

02లో

# ఆరోగ్యశాఖ తీరుపై విమర్శలు

# ఆశా కార్యకర్తలతో వెట్టీచాకిరి?

- వైద్య సేవలకే పరిమితం కావాల్సిన వారితో పారిశుధ్య పనులు!
- ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల పనులూ ఆశాలకేనా?




**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 11:** గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో కీలకంగా పనిచేసే ఆశా కార్యకర్తలపై వడ్డేపల్లి మండలంలో అదనపు పనిభారంపడుతున్నట్లు క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలంలో 10 గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో కలిపి సుమారు 36 మంది ఆశా కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు.సిబ్బంది కొరత పేరుతో రోజుకు ఇద్దరు చొప్పున ఉదయం,మధ్యాహ్నం విధులుకేటాయిస్తున్నట్లు తెలుస్తోంది.దీంతో ఇప్పటికే ఆరోగ్య సేవల్లో నిమగ్నమై ఉన్న ఆశా కార్యకర్తలపై అదనపు భారం పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో చేయిస్తున్న పనులను పరిశీలిస్తే పరిస్థితే మరింత ఆసక్తికరంగా మారుతోంది.వైద్య సేవల్లో భాగంగా ప్రజలకుఅందించాల్సిన సేవలతో పాటు పీహెచ్‌సీని శుభ్రపరిచే పనులు అధికారులకు నీళ్లు పెట్టడం,బండలు, టాయిలెట్లు శుభ్రం చేయడం వంటి పనులు కూడా ఆశా కార్యకర్తల విధుల్లోభాగమయ్యాయా అనే ప్రశ్నలుతలెత్తుతున్నాయి.ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించడం ఎంతవరకుసమంజసమనే చర్చ జరుగుతోంది.ఇక మరోవైపు ఎన్‌సీడీ స్క్రీనింగ్,ఆన్‌లైన్ నమోదు వంటి పనుల భారం కూడా ఆశా కార్యకర్తలపై పడుతున్నట్లు తెలుస్తోంది.ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు సంబంధించిన కొన్ని పనులను కూడా ఆశాలే నిర్వహించాల్సి వస్తున్న పరిస్థితి ఉందనే విమర్శలువినిపిస్తున్నాయి.సెల్‌ఫోన్లు సరిగా పనిచేయని సమయంలో కుటుంబ సభ్యుల ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితిఏర్పడుతున్నట్లుసమాచారం ప్రతిరోజూ బీపీ పరీక్షలు నిర్వహించడం, రికార్డులు రాయించడం వంటి పనులతో పీహెచ్‌సీ విధుల్లో ఆశాలపై మరింత ఒత్తిడి పెరుగుతోంది.గ్రామాల నుంచి వడ్డేపల్లి పీహెచ్‌సీకి వెళ్లేందుకు ఒక్కోసారి రూ.50 నుంచి రూ.100 వరకు ప్రయాణ ఖర్చు అవుతున్న పరిస్థితి కూడా ఉంది.చాలీచాలని పారితోషికంతో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు అదనపు ప్రయాణ భారం కూడా ఇబ్బందిగా మారుతోంది.విధి నిర్వహణలో భాగంగా తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తే భద్రతాపరమైన బాధ్యత ఎవరిది అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.ఇక ప్రసవాలసమయంలోనూ ఆశా కార్యకర్తలపై అదనపు భారం పడుతున్నట్లు తెలుస్తోంది.పీహెచ్‌సీలో ప్రసవం సాధ్యం కాని సందర్భాల్లో గర్భిణులను జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయడంతో అక్కడ కూడా ఆశా కార్యకర్తలు వెంట ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రెండు రోజుల వరకు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తున్నా,వారికి ప్రత్యేకంగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం గమనార్హం.

మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

# గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు

## గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు

## 13న కొమిరెడ్డిపల్లి శివాలయంలో నిర్వహణ.. హిందూ బంధువులు, గో సేవకులు పాల్గొనాలి

**గండీడ్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

గండీడ్ మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గో ఆధారిత వ్యవసాయం, గో పరిరక్షణతో పాటు గోవుల వల్ల మానవాళికి, ప్రకృతికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 13న ఆదివారం నిర్వహించనున్నట్లు మండల విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు తెలిపారు.గండీడ్ మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామ శివాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. గో ఆధారిత వ్యవసాయం ప్రాధాన్యత, ప్రకృతి పరిరక్షణలో గోవుల పాత్ర, గో పరిరక్షణ అవసరం తదితర అంశాలపై మేధావులు, నిపుణులు అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా హిందూ బంధువులు, గో సేవకులు, రైతులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు."జై శ్రీరామ్.. భారత్ మాతాకీ జై.. జై హిందూ" అంటూ గండీడ్ మండల విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు హిందూ బంధువులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## "షష్టాబ్ది "కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయని లకు కు సన్మానం

**మహమ్మూదాబాద్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి )**

మండల కేంద్రం లోని ప్రభుత్వ బాలికల పాఠశాల లో ఉత్తమ ఉపాధ్యాయని లను షష్టాబ్ది కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దడం లో నూ నాణ్యమైన విద్య నందించడం లో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని భావి భారత పౌరులను తయారు చేసే శక్తి కేవలం గురువులకే ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో మండల మండల విద్యాధికారి రాజు నాయక్, గ్రామ సర్పంచ్ రామ్ లాల్ మాజీ సర్పంచ్ రాజేందర్,అనంతయ్య గుప్తా తో పాటు విశ్వహిందూ పరిషత్ వేణు గౌడ్ మరియు షష్టాబ్ది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## గణపతి ఉత్సవాలకు పోలీసుల నిబంధనలు తప్పనిసరి అయిజ ఎస్సై గురు స్వామి



**ఆలంపూర్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ పట్టణ కేంద్రంలో గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించాలని అయిజ ఎస్సై గురు స్వామి సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. అనుమతి లేని డీజేలు, అధిక శబ్దం, రాత్రి వేళల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగం చేయరాదని హెచ్చరించారు. ఊరేగింపు, నిమజ్జనం పోలీసుల సూచించిన మార్గం, సమయాల్లోనే నిర్వహించాలని, విద్యుత్, అగ్నిప్రమాద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గురు స్వామి సూచించారు.ఖ

మొదటిపేజీ తరువాయి

## ఆరోగ్యశాఖ తీరు పై విమర్శలు ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరి?

గ్రామాల నుంచి వడ్డేపల్లి పీహెచ్‌సీకి వెళ్లేందుకు ఒక్కోసారి రూ.50 నుంచి రూ.100 వరకు ప్రయాణ ఖర్చు అవుతున్న పరిస్థితి కూడా ఉంది.చాలీచాలని పారితోషికంతో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు అదనపు ప్రయాణ భారం కూడా ఇబ్బందిగా మారుతోంది.విధి నిర్వహణలో భాగంగా తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తే భద్రతాపరమైన బాధ్యత ఎవరిది అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.ఇక ప్రసవాలసమయంలోనూ ఆశా కార్యకర్తలపై అదనపు భారం పడుతున్నట్లు తెలుస్తోంది.పీహెచ్‌సీలో ప్రసవం సాధ్యం కాని సందర్భాల్లో గర్భిణులను జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయడంతో అక్కడ కూడా ఆశా కార్యకర్తలు వెంట ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రెండు రోజుల వరకు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తున్నా,వారికి ప్రత్యేకంగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం గమనార్హం.ఆశా కార్యకర్తల కోసం ప్రత్యేక గది కేటాయించకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.దీర్ఘకాలం నిలబడటం వల్ల పలువురు వెన్నునొప్పి తదితర సమస్యలకు గురవుతూ ఎవరితో చెప్పు కావాలో తెలియక అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది.ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన ఆశా కార్యకర్తలు అసలు విధులతో పాటు ఇతర పనుల్లో నిమగ్నమైతే గ్రామీణ ఆరోగ్య సేవలపై ప్రభావం పడే అవకాశం ఉంది.అధికారుల రికార్డులు,ఆన్‌లైన్ పనులు,పారిశుద్ధ్య పనులు ఇలా ఒక్కో పని అదనంగా చేరడంతో అసలు క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలకు సమయం తగ్గే పరిస్థితికనిపిస్తోంది.అయితే ఆశా కార్యకర్తలకు ఏయే పనులు అధికారికంగా కేటాయించారో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ), జిల్లా కలెక్టర్ ఈ అంశంపై దృష్టి సారించి వడ్డేపల్లి పీహెచ్‌సీలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.ఆశా కార్యకర్తలకు వారి విధుల్లో భాగమైన ఆరోగ్య సేవలను మాత్రమే అప్పగించి, అదనపు పనిభారం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.వైద్య సేవల వ్యవస్థలో కీలకంగా పనిచేసే ఆశా కార్యకర్తలను వెట్టిచాకిరీకి గురిచేస్తున్నారనే విమర్శలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

# గణపతి ఆగమనంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు

**గద్వాల సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గద్వాల పట్టణంలో 'గణపతి ఆగమనం' పేరుతో విగ్రహాలను తరలించే సమయంలో సాధారణ ప్రజలకు,వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు హెచ్చరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని,ప్రజా భద్రత,శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విగ్రహాల తరలింపు సమయంలో రహదారులను పూర్తిగా దిగ్బంధించడం,వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం చేయరాదన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ చౌక్,కృష్ణవేణి చౌక్, సుంకులమ్మ మెట్టు,మెయిన్ రోడ్,నల్లకుంట--రాజీవ్ మార్గ్,బస్టాండ్ రోడ్డు ప్రాంతాల్లో విగ్రహాల వాహనాలను నిలిపి డ్యాన్సులు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.




### డీజేలపై ఆంక్షలు

విగ్రహాల ఆగమనం,నిమజ్జనం సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు,సౌండ్ వాల్స్ వినియోగించ రాదన్నారు. రోగులు,వృద్ధులు,విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నిర్ణీత శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

### మండపాలకు ముందస్తు అనుమతులు

రహదారుల వెడల్పును తగ్గించేలా,వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఇష్టానుసారంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా తెలంగాణ పోలీస్ పోర్టల్ వంటి అధికారిక మార్గాల ద్వారా అనుమతులు పొందాలని సూచించారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

విగ్రహాల ఊరేగింపుల్లో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపడం,హంగామా చేయడం వంటివి చేస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కఠిన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

### భద్రతకు ప్రాధాన్యం

విగ్రహాలు విద్యుత్ వైర్లకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు,అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్)తో పాటు ఇతర శాంతిభద్రతల చట్టాల కింద కేసులు నమోదు చేసి,భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. "పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి..ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దు. ముఖ్యంగా 108, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా దారి ఇవ్వాలి. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు,కేసులు తప్పవు" అని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రజలు 112 నంబర్‌కు లేదా గద్వాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# మండల స్థాయి సాధారణ సమావేశం

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్

**ఆలంపూర్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన మండల స్థాయి సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్ మాట్లాడుతూజిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచనల మేరకు మండలంలోని గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలోవివిధ గ్రామ సర్పంచులు మాట్లాడుతూ,,,,,,,, గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్, ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో మండల, గ్రామస్థాయి అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.






# దళితుల ఇళ్లు ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**బాధితులకు నష్టపరిహారంగా రూ. 30లక్షలు చెల్లించాలి**

**భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ వ్యవస్థ చర్యలు తీసుకోవాలి**

**బి. కురుమన్న, జిల్లా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్**

**ఆలంపూర్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి ప్రతినిధి)**



గద్వాల మండల పరిధిలోని రేపల్లి గ్రామంలో మాదిగ కులానికి చెందిన రంగముని, బీసీ కులానికి చెందిన మహేశ్వరి ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారనే సమాచారంతో జీర్ణించుకోలేని మహేశ్వరి కుటుంబ సభ్యులు దళిత రంగముని ఇంటిపైకి వెళ్లి సుమారు 30-40 మంది ప్రొక్లైన్ ( జేసిబి ), గడ్డపారలతో ధ్వంసం చేయడం దుర్మార్గం, ఇళ్లు ధ్వంసం చేసిన బీసీ కులానికి చెందిన వారిని వెంటనే అరెస్టు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగాఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకుని తమ ఇష్ట ప్రకారం కులాంతర వివాహం చేసుకుంటే కుల వివక్షత పేరుతో దాడులు సరికాదని విమర్శించారు. అలాగే పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే దళితుల ఇళ్లు నేలమట్టం అయ్యేవి కాదని విమర్శించారు. ఇప్పటికైనా పోలీసులు తక్షణం స్పందించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన బాధితులకు 30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని అధికారులను కోరారుఅదేవిధంగా ప్రేమజంటకు మరియు కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని అదేవిధంగా గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా బందోబస్త్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆడబిడ్డల కోసం ఉచిత బస్సు వేశారు కానీ బస్టాండలో ఉచిత టాయిలెట్ కట్టించాలి ఆడబిడ్డల డిమాండ్

**ఆలంపూర్ సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఆడబిడ్డల ఓట్ల కోసం ఉచిత బస్సులని వేల కోట్లు కుమ్మరిస్తున్న పాలకులకు...అదే ఆడబిడ్డ బస్సు దిగితే ఉపయోగించుకోవడానికి ఒక్క పైసా ఖర్చు లేని,శుభ్రమైన ఉచిత టాయిలెట్ కట్టించే సోయి లేదా? అదేవిధంగామగాళ్లు అంటే ఎక్కడైనా రోడ్డు పక్కన ఆగుతారు,మరి మన అక్కాచెల్లెళ్ల పరిస్థితి ఏంటి? అర్జెంటైతే చేతిలో చిల్లర లేక దుకాణాల చుట్టూ తిరగాలా? జేబులో రూపాయి లేకపోతే ప్రాణం పోయేదాకా మూత్రం ఆపుకుని రోగాల బారిన పడాలా? మౌలిక అవసరమైన బాత్రూమ్‌లను కూడా 'పే అండ్ యూజ్' అని పెట్టి దోపిడీ చేయడం సిగ్గుచేటు కాదా?

**(పాలకులను నిలదీస్తున్న సూటి ప్రశ్నలు:)**

(బస్సు ఫ్రీ... బాత్రూమ్‌కు ఫీజా?: )ఆడబిడ్డలకు బస్సు ప్రయాణం ఉచితం అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు,బస్టాండ్‌లో కనీస వసతులు ఎందుకు ఉచితంగా ఇవ్వలేకపోతున్నాయి?

**(మహిళల ఆత్మగౌరవం ఎక్కడ?:)**

పల్లెలు,పట్నాల్లోని బస్టాండ్లు,రద్దీగా ఉండే చౌరస్తాల్లో మహిళల కోసం సురక్షితమైన,రన్నింగ్ వాటర్ ఉండే ఉచిత పబ్లిక్ టాయిలెట్లు ఎందుకు నిర్మించట్లేదు?




**(డబ్బా ప్రచారాలు ఆపండి:)**

మహిళల ప్రాథమిక అవసరాన్ని,ఆత్మగౌరవాన్ని కాపాడలేని సంక్షేమ పథకాలు ఎవరి కోసం?ముందు ఆడబిడ్డలకు పరువుగా ఉపయోగపడే పరిశుభ్రమైన వసతులు కల్పించండి!




**( ఆలోచించండి:)**

ఈ చెల్లెమ్మ అడిగిన ప్రతి మాటలోనూ న్యాయం ఉంది.ఇది ఒక్కరి సమస్య కాదు...నిత్యం ప్రయాణాలు చేసే లక్షలాది మంది మహిళల దైనందిన ఆవేదన వ్యక్తం చేశారు

# ప్రేమ వివాహం చేసుకోవడం తప్ప



-బీసీ వర్గానికి చెందిన అమ్మాయిని ఎస్సీ వర్గానికి చెందిన అబ్బాయి వివాహం చేసుకోవడంతో అబ్బాయి ఇల్లు నీ కూల్చివేసిన అమ్మాయి తల్లిదండ్రులు

-ఇంటిని కూల్చడం అనాగరిక చర్య

ఘటనపై పోలీసు అధికారులు త్వరితగతిన విచారణ చేపట్టాలి

-నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మణి కుమార్ గద్వాల ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11:**

దళితుల ఇంటిని కూల్చడం అనాగరిక చర్య అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మణికుమార్ అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి శు క్రవారం గద్వాల మండలం రేపల్లెలో గ్రామములో గురువారం మధ్యాహ్నం కూల్చిన దళితుల ఇంటిని పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిసి వర్గానికి చెందిన అమ్మాయిని ఎస్సీ వర్గానికి చెందిన అబ్బాయి రెండు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకోవడంతో అమ్మాయి తల్లిదండ్రులు అది జీర్ణించుకోలేక అబ్బాయి యొక్క కుటుంబీకులు దళితులు కావడంతో వారు ఏమి చేయలేరు అనేఅహంకారమైనటువంటి ఆలోచనతో దళితుల ఇంటిపై దాడి చేసి అత్యాధునిక వాహనం సహాయంతో ఇంటిని కూల్చివేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు.ఘటనపై పోలీసు అధికారులు విచారణ చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇంటి కూల్చిన నిందితులపై కఠినమైన శిక్షను అమలు చేయాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి నష్టపరిహారంతో పాటు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వము ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసి.నిర్మించేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.అదేవిధంగా కుటుంబంకు రక్షణ కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శాంతిరాజు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు, సెక్టార్ కమిటీ కార్యదర్శి బోయ మధు ఇతరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**రేవల్లి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కేశంపేట యూపీఎస్ ఉపాధ్యాయులు ఎస్.కృష్ణయ్య, పి.శ్రీశైలంను గ్రామ సర్పంచ్ బాదేపల్లి రేవతి సురేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. కేశంపేట యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం కేశంపేట పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.వెంకటేష్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యుడు బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్--2026 వినికిడి కార్యక్రమాన్ని పరిశీలించిన ఈ ఆర్ ఓ హరిప్రియ

**జడ్చర్ల, సెప్టెంబర్ 11:శ్రీ ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక సమగ్ర సవరణ 2026 ప్రక్రియలో భాగంగా జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న వినికిడి కార్యక్రమాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్ జిల్లా, 75--జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.ఎల్.బి. హరిప్రియ శుక్రవారం పరిశీలించారు.జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వినికిడి కార్యక్రమం తీరును ఆమె పరిశీలించి, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి అందుతున్న అభ్యంతరాలు, అభ్యర్థనలు నిబంధనల ప్రకారం పరిశీలించే విధానాన్ని గమనించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్, అదనపు తహసీల్దార్‌తో పాటు 75--జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్షన్ డీటీ తదితర అధికారులు పాల్గొన్నారు.



# రీసర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి

## - కొమిరెడ్డిపల్లిలో పనులను పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ శుక్రవారం పరిశీలించారు. ఆర్డీఓ నవీన్‌తో కలిసి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆమె రీసర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. మండల సర్వేయర్ ఆధ్వర్యంలో జరుగుతున్న రీసర్వే పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్, నిర్దేశిత నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా రీసర్వేను పూర్తి చేయాలని సూచించారు. రీసర్వేలో భూములకు సంబంధించిన వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల విషయంలో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.రీసర్వే పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హరిప్రియ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



# డెంగ్యూపై అప్రమత్తం.. సద్దలగుండులో లార్వా నిర్మూలన

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సద్దలగుండు ప్రాంతంలో డెంగ్యూ కేసు నమోదైన నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు శుక్రవారం సద్దలగుండు ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే దోమల లార్వా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి, పరిసరాల్లో చేపడుతున్న లార్వా నిర్మూలన కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. దోమల వృద్ధికి అవకాశం ఉన్న నీటి నిల్వలను తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన డీఎంహెచ్ఓ, డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని సూచించారు. డెంగ్యూ నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ తరపున అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు దోమల నివారణ చర్యల్లో అధికారులకు సహకరించాలని డా. శ్రీనివాసులు కోరారు.



# ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక ప్రచార దినాలు

- సెప్టెంబర్ 12, 13న పకడ్బందీగా నిర్వహణ.. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వో లు, సూపర్‌వైజర్లు, ఎయిఆరో లు అందుబాటులో ఉండాలి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార దినాలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వో లు, సూపర్‌వైజర్లు, ఎయిఆర్వో లు సమన్వయంతో విధులు నిర్వహించాలని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో నిర్ణీత సమయాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు.

**18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి:**
18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువతీ యువకులతో పాటు ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి, వారి నుంచి ఫామ్-6 దరఖాస్తులు స్వీకరించి ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.మొదటిసారిగా ఓటు హక్కు పొందనున్న యువతలో అవగాహన కల్పించి, తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడికి అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వాన్ని బీఎల్వో లు అందించాలని సూచించారు.

**అనర్హుల పేర్లపై నిబంధనల మేరకు పరిశీలన**
ఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లు లేదా ఇతర కారణాలతో అనర్హులైన ఓటర్ల వివరాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం పరిశీలించి ఫామ్-7 ద్వారా తొలగింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు అనవసరంగా తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఓటరు వివరాల్లో తప్పులు ఉంటే సరిదిద్దుకోవచ్చు:**
ఓటరు జాబితాలో ఇప్పటికే నమోదైన పేరు, వయస్సు, చిరునామా, ఫోటో తదితర వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉంటే ఫామ్-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఓటరు నమోదు, పేరు తొలగింపు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. బీఎల్వోలు తమ పరిధిలోని ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ కొత్త అర్హులైన ఓటర్లను గుర్తించడం, ఇప్పటికే నమోదైన వివరాలను పరిశీలించడం, అవసరమైన సవరణలను నమోదు చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.బిఎల్వో , సూపర్‌వైజర్లు, ఎయిఆర్వో లు పోలింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక ప్రచార దినాల నిర్వహణను సమీక్షించాలని ఆదేశించారు. స్వీకరించిన ఫాం-6, ఫాం-7, ఫాం - 8 దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి, పెండింగ్ లేకుండా తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన పౌరులు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగే ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరు నమోదుకు ఫామ్-6, పేరు



తొలగింపునకు ఫామ్-7, ఓటరు వివరాల సవరణకు ఫామ్-8 దరఖాస్తులను సమర్పించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కోరారు. “అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, ఓటరు జాబితా శుద్ధంగా, పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేలా చూడటం అధికారుల బాధ్యత” అని ఆయన పేర్కొన్నారు.

# వినాయక ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

- ఆన్‌లైన్‌లో మండపాల పూర్తి వివరాలు నమోదు చేయాలి

- భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా వేడుకలు నిర్వహించాలి: ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్ స్టేషన్, విగ్రహ ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి వినియోగించే వాహనం తదితర వివరాలను పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కమిటీ సభ్యులు, నిర్వాహకులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురైతే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

**విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు:**
విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలు, రోడ్డు మార్గాలు, ఇతర వాహనాలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల రవాణా వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అధిక వేగంతో ప్రయాణించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు

**మట్టి గణపతులకే ప్రాధాన్యత:**
పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. గణపతి మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, జనరేటర్లు, టెంట్ల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలు:**
వినాయక నవరాత్రుల సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలీస్ శాఖ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ కోరారు.ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా జిల్లా పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు.



# పాలమూరులో 'కల్లు' కోసం కుల కుంపటి..!

- పాలమూరు కాంగ్రేస్ వర్గపోరులో గౌడ కమ్యూనిటీ బలి!
- అధికార బలం.. పోలీసుల ఏకపక్ష వైఖరి
- - ఎక్సైజ్ శాఖ అనుమానాస్పద మౌనం
- గౌడ కులం పై ఆధిపత్య పోరుకు ప్రయత్నిస్తున్న ఆ ఇతర కులనేత ఎవరు.?
- గౌడుల జీవనాధారంపై రాజకీయ డేగల పెత్తనం.?
- కల్తీ కల్లు తయారీ డిపో వద్ద రెండు రోజులుగా గలాటా.. అరెస్టులతో మరింత రగిలిన వివాదం
- కల్తీ కల్లు ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు?

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాలమూరులో ఇప్పుడు రాజకీయాలకు కొత్త 'రుచి' వచ్చిందా..? గౌడుల సంప్రదాయ వృత్తి అయిన కల్లు వ్యాపారం చుట్టూ కాంగ్రెస్ పార్టీలోని అంతర్గతమైన వర్గపోరు ముదురుతోందా..? మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయం వేడెక్కింది. జిల్లాలో అత్యంత బలమైన గౌడ సామాజిక వర్గంలో తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు నేతలు చీలికలు తెస్తూ, కులాల మధ్య "మామ్ల కుంపటి " పెట్టీ వారిమధ్యనే ఆధిపత్య పోరును ప్రోత్సహిస్తున్నారనే వార్తలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గౌడ కులస్తుల సాంప్రదాయ వృత్తి అయిన కల్లు వ్యాపారంలోకి ఇతర అగ్రకుల నేతలు జోక్యం చేసుకుంటూ, తమ సొంత ప్రయోజనాల కోసం నెల వారి వాటాల గొడవలు సృష్టిస్తున్నారని, దీనివల్ల శ్రమజీవులైన గౌడ లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి."ఎవరి చేతిలో అధికారం ఉంటే వారి చేతిలోనే కల్తీ కల్లు తయారీ డిపోనా..?" అన్నట్లుగా అడవి వెంకటాపూర్ శివారులోని కల్లు డిపో వ్యవహారం రెండు రోజులుగా ఉద్రిక్తతకు కేంద్రంగా మారింది. "కల్లు మామ్ల" నిర్వహణ విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం చివరకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కడం, అరెస్టుల వరకు వెళ్లడం గౌడ సామాజిక వర్గంలో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నట్లు సమాచారం.

## కల్లు మామ్ల కోసం 'కుల' మంటలు..?

అసెంబ్లీ ఎన్నికల్లో యెన్నం శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తి కల్లు వ్యాపారాన్ని కైవసం చేసుకోవడం కోసం ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతాప్ గౌడ్ కల్లు మామ్లను కైవసం చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు గతంలో కల్లు మామ్ల నిర్వహించిన కుమార్ గౌడ్, ఆయన అనుచరులు, కొందరు గౌడ సంఘం నాయకులు దీనిని వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డిపో వద్ద వివాదం చెలరేగి, ఒక వర్గాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం మరింత ఆగ్రహానికి దారితీసిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి."పులి మీద పుట్రలా.. కల్లు డిపోపై రాజకీయ పట్టు!" అన్న చందంగా పరిస్థితి మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## కల్తీ కల్లు ఆరోపణలు.. కలుపుతున్న బోరు నీళ్ల సంగతేంటి..?

అడవి వెంకటాపూర్ శివారులోని డిపో వద్ద పెద్ద పెద్ద హౌజ్ లలో నీటిని నింపి విషపూరితమైన రసాయనాలు కలిపి కల్లు తయారు చేస్తున్నారంటూ ప్రత్యర్థి వర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అసలు స్వచ్ఛమైన కల్లు దొరకడం లేదని నీళ్ళతో కల్తీ కల్లు తయారీ చేస్తున్నారని డిపో వద్ద కొందరు గౌడ కులస్తులు రూరల్ ఎస్సై విజయ్ కుమార్, పోలీసు సిబ్బంది సమక్షంలోనే బహిరంగంగా ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజమా.? కాదా.? అన్నది తేల్చాల్సింది మాత్రం సంబంధిత ఎక్సైజ్ శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసుల దర్యాప్తే. ఎందుకంటే కల్లు సహజ ఉత్పత్తి అయితే ఒక రకం.. అందులో నిబంధనలకు విరుద్ధంగా రసాయన పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా తయారు చేస్తే మరో రకం. సహజ సిద్ధమైన కళ్ళు దాహం తీరుస్తే రసాయనాలతో కూడిన కళ్ళు మత్తులో ముంచెత్తుతుంది, అలవాటు పడ్డ వారు ఒక్క రోజు తాగ పిచ్చెక్కి పోతుంటారు. కానీ ఈ ఆరోపణలు నిజమైతే అది కేవలం రెండు వర్గాల గొడవ కాదు.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన తీవ్రమైన అంశం. "ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు" అన్న సామెతలా అధికారులు మౌనం వహిస్తే మాత్రం అనుమానాలకు తావిచ్చినట్టే అవుతుంది.

## పోలీసుల తీరుపై గౌడుల్లో గుసగుసలు:

డిపో వద్ద ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం ఒకవైపు.. అసలు వివాదానికి మూలకారణం ఏమిటి.? డిపో నిర్వహణకు ఎవరికీ అధికారిక అనుమతి ఉంది.? మామ్ల కేటాయింపు ఎలా జరిగింది.? అన్న ప్రశ్నలకు సమాధానాలు మాత్రం బయటకు రావాల్సి ఉంది."ఒకరికి న్యాయం.. మరొకరికి అరెస్టు" అన్న భావన ఏర్పడితే అది పోలీసు వ్యవస్థపై వున్న నమ్మకానికే దెబ్బ. పోలీసులు ఏ వర్గానికీ కొమ్ముకాయకుండా, వివాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా విచారించి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎక్సైజ్ శాఖ మౌనం.. 'మామ్ల' ముచ్చటేనా.?

కల్లు డిపో వివాదం రెండు రోజులుగా రగులుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారు.?డిపోకు అనుమతి ఎవరి పేరుతో ఉంది.? కల్లు సేకరణ, నిల్వ, విక్రయానికి నిబంధనలు పాటిస్తున్నారా.? కల్లు నాణ్యతను పరీక్షించారా.? కల్తీ ఆరోపణలపై నమూనాలు సేకరించారా.? ఎవరికి "మామ్ల" నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.?ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. "చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకున్నట్టు.. గౌడుల వృత్తి పేరు చెప్పుకొని రాజకీయ పందెం నడుస్తోందా.?" అన్న అనుమానాలు తొలగాలంటే అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి.

## గౌడ కమ్యూనిటీని రాజకీయ పావుగా మార్చొద్దు.!

గౌడ సామాజిక వర్గానికి కల్లు వృత్తి కేవలం వ్యాపారం కాదు.. తరతరాల జీవనాధారం. అలాంటి వృత్తిలో రాజకీయ జోక్యం, ఆధిపత్య పోరు పెరిగితే నష్టపోయేది చివరకు సామాన్య గౌడ కుటుంబాలేనని ఆ వర్గానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది."రాజకీయ నాయకుల పంచాయితీ.. పేదల పొట్టపై వేట" అన్న పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

## కాంగ్రెస్‌లో 'కోల్డ్ వార్'.. గౌడుల్లో 'హాట్ టాపిక్'..!!

కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత వర్గపోరుకు గౌడ సామాజిక వర్గాన్ని వేదికగా మార్చుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాజకీయంగా కీలకమైన గౌడ వర్గంలో అసంతృప్తి పెరిగితే దాని ప్రభావం పార్టీపై పడే అవకాశం లేకపోలేదు. "ఇంట్లో గొడవ ఉంటే గడప దాటకముందే సర్దుకోవాలి.. వీధిలోకి వచ్చిన తర్వాత పరువు పోతుంది" అన్న సామెతను కాంగ్రెస్ పెద్దలు గుర్తుపెట్టుకోవాల్సిన సమయం ఇదే.

## పోలీసుల ఏకపక్ష వైఖరి -- ఎక్సైజ్ శాఖ అనుమానాస్పద మౌనం

కల్లు డిపోలు, సొసైటీల వద్ద ఒక వర్గం నేతలు ఆందోళనకు దిగి





నేరుగా తయారీ కేంద్రాల్లోకి చొరబడిన క్రమంలో పోలీసు వ్యవస్థ వ్యవహరించిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతాయుతంగా ఉండాల్సిన పోలీసులు ఒక వర్గానికి దాసోహమై, గతంలో పనిచేసిన కల్లు దుకాణదారులను, గౌడ లబ్ధిదారులను అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. బాధితులైన మహిళలు నేరుగా ఆ నేత ఇంటిని ముట్టడించి ఆందోళనకు దిగినప్పటికీ, ఈ మొత్తం వ్యవహారంపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం వెనుక ఏ అధికార శక్తి ఉందోనన్న విమర్శలు వస్తున్నాయి.

## అసలు 'కల్లు' ఎవరిది.? అసలు 'పట్టు' ఎవరిది.?

కల్లు డిపో ఎవరి ఆధీనంలో ఉంది.?"మామ్ల" నిర్వహణకు అధికారిక హక్కు ఎవరికుంది.? డిపో వద్ద నిబంధనలు పాటిస్తున్నారా.?కల్తీ ఆరోపణల్లో నిజమెంత.?ఎవరెవరి పాత్ర ఉంది.? పోలీసులు ఎందుకు ఒక వర్గానిపైనే చర్యలు తీసుకున్నారు.? ఎక్సైజ్ అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పష్టత ఇవ్వలేదు.? ఈ ప్రశ్నలన్నింటికీ స్వతంత్ర విచారణతోనే సమాధానం రావాలి. లేకపోతే.. "కల్లు కోసం మొదలైన గొడవ.. కులం వరకు చేరి.. చివరకు రాజకీయ పుల్లగా మారే ప్రమాదం ఉంది!" ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన కల్తీ ఆరోపణలను తేలికగా తీసుకోకుండా, రాజకీయ రంగు పులుముకున్న డిపో వివాదంపై ఎక్సైజ్ శాఖ సమగ్ర తనిఖీ, కల్లు నమూనాల పరీక్ష, డిపో అనుమతుల పరిశీలన, పోలీసుల చర్యలపై నిష్పక్షపాత సమీక్ష చేపట్టాలని గౌడ సామాజిక వర్గం కోరుతోంది. కల్లు ఎవరు అమ్ముకున్నా ప్రభుత్వ నిబంధనలే పైచేయి కావాలి..రాజకీయ రంగు ఏదైనా ప్రజల ఆరోగ్యమే మొదటి ప్రాధాన్యత కావాలి.పార్టీ ఉనికికే ప్రమాదకరంగా మారిన 'కోల్డ్ వార్' రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ, మహబూబ్ నగర్ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఈ వివాదం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. తమ రాజకీయ ఉనికిని, ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి గౌడ సామాజిక వర్గంపై పెత్తనం చెలాయించేందుకు కొందరు అగ్రకుల నేతలు ఆడుతున్న ఈ 'రాజకీయ క్రీడ' కాంగ్రెస్ పార్టీకే పెద్ద శరాఘాతంగా మారే అవకాశం ఉంది. జిల్లాలో కీలకమైన గౌడ వర్గంలో రగులుతున్న ఈ అసంతృప్తిని, అంతర్గత కోల్డ్ వార్‌ను అధిష్టానం సమయానికి చక్రం తిప్పి పరిష్కరించకపోతే, అది జిల్లా కేంద్రంలో పార్టీ క్షీణతకు కారణమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రోడ్డుపై పసి శిశువు.. వెనుక విషాద గాథ!

### - ప్రేమ పేరుతో మైనర్ బాలికకు మోసం.. ప్రసవం విషయం దాచేందుకు నవజాత శిశువును వదిలివేత

### - సీసీ కెమెరాలతో ఛేదించిన టూ టౌన్ పోలీసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** రోడ్డుపై కనిపించిన పసికందు... పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన విషాద గాథ! ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను మోసం చేసిన యువకుడి వ్యవహారం చివరకు ఓ నవజాత శిశువును రోడ్డుపై వదిలివేసే దుస్థితికి దారితీసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. జూన్ 5న మహబూబ్‌నగర్‌లోని కె ఎఫ్ సి సమీపంలో నవజాత శిశువును రోడ్డుపై వదిలివేసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ ముందుకు సాగిన పోలీసులు చివరకు ఘటనకు సంబంధించిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రకటించారు.

**ప్రేమ పేరుతో మోసం..:**

పోలీసుల వివరాల ప్రకారం గార్లపాడు గ్రామానికి చెందిన ఆనంద్ అనే యువకుడితో ఓ మైనర్ బాలికకు పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో ఆమెను మోసం చేయడంతో బాలిక గర్భం దాల్చినట్లు దర్యాప్తులో తేలింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియకుండా బాలిక దాచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఆసుపత్రికి వెళ్తుండగా ఆటోలోనే ప్రసవం:**

సెప్టెంబర్ 4న బాలిక కడుపునొప్పితో బాధపడటంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో మహబూబ్‌నగర్‌లోని ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీంతో విషయం బయటకు వస్తుందనే భయంతో బాలిక తల్లి, తండ్రి, బాబాయి కలిసి జన్మించిన శిశువును రోడ్డుపై వదిలివెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

**సాంకేతిక ఆధారాలతో ఛేదన:**

ఘటనను సీరియస్‌గా తీసుకున్న టూ టౌన్ పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. వాటి ఆధారంగా ఘటనకు సంబంధించిన వ్యక్తులను గుర్తించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




**పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు:**

కేసును సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎజాజుద్దీన్, ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు, ఏఎస్సై సాయి నిర్మల దేవి, హెచ్‌సీ శేఖర్, కానిస్టేబుళ్లు అశోక్, కూరమూర్తిలను జిల్లా ఎస్పీ దరావత్ జానకి అభినందించారు. నేరాల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని పోలీసు అధికారులకు సూచించారు.

**మైనర్ బాలికల భద్రతపై అప్రమత్తత అవసరం:**

మైనర్ బాలికలు ప్రేమ పేరుతో మోసపోయి తమ భవిష్యత్తును నష్టపరుచుకోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు సూచించారు. బాలికలకు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, నమ్మకమైన పెద్దలు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మైనర్ బాలికలను మోసం చేయడం, లైంగిక దోపిడీకి పాల్పడటం వంటి నేరాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఒకవైపు మైనర్ బాలిక భవిష్యత్తు ప్రశ్నార్థకం కాగా.. మరోవైపు పుట్టిన వెంటనే పసికందును రోడ్డుపై వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలు, బాధ్యులపై తీసుకునే చట్టపరమైన చర్యలు దర్యాప్తు పూర్తయిన తర్వాత మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# వినాయక ఉత్సవాల వేళ అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ జానకి

### - వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### - పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి.. ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ దరావత్ జానకి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఎస్పీ.. పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కారం, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా పెంచాలని, పెండింగ్ కేసులను ప్రత్యేకంగా పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు

**ట్రాఫిక్‌పై ప్రత్యేక నిఘా:**

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, మార్కెట్లు, రద్దీ రహదారులు ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని సూచించారు. నో- పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించడంతో పాటు పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు.

**వినాయక ఉత్సవాల వేళ మరింత అప్రమత్తత:**

వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వన్‌టౌన్ పరిధిలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వినాయక మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు నిర్వాహకులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వినాయక మండపాలు, ఊరేగింపులు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని వినియోగించాలని, విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, శబ్ద పరిమితులు, రహదారుల ఆక్రమణ వంటి అంశాలపై నిర్వాహకులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, రాత్రివేళల్లో గస్తీని పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు.




**ప్రజల సహకారంతోనే ప్రశాంత వాతావరణం:**

వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712659360 లేదా ఎమర్జెన్సీ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు. స్టేషన్ తనిఖీ సందర్భంగా వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్యతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు మరణ ధృవపత్రాల జారీ

- బొమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసిన
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 11( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



ఒకే మరణించిన వ్యక్తికి రెండు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాలు జారీ చేసిన ఘటనపై నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. రమేష్ బాబును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం సస్పెండ్ చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారని నాగర్ కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు.ఇటీవలే వివిధ తెలుగు దినపత్రికల్లో "ఒక్కరికీ రెండు ధృవపత్రాలు" అనే శీర్షికన వెలువడిన వార్తలపై విచారణ చేపట్టాలని అచ్చంపేట డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశించగా, విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం ఈ చర్యలు తీసుకున్నారని డిపిఓ తెలిపారు. విచారణ నివేదిక ప్రకారం, బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా 01.08.2024 నుంచి విధులు నిర్వహిస్తున్న వి. రమేష్ బాబు హయాంలో ఒకే మరణించిన వ్యక్తికి రెండు పర్యాయాలు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాలు జారీ చేసినట్లు గుర్తించడం జరిగిందని, సంబంధిత వివరాలు ఆన్‌లైన్ రికార్డుల్లో రెండుసార్లు నమోదు కాగా, మరణ ధృవపత్రాల జారీ రిజిస్టర్‌లో మాత్రం ఒకసారి మాత్రమే నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైందని,ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేయడం, గ్రామ పంచాయతీ చట్టబద్ధ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అధికారాలను దుర్వినియోగం చేయడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం తక్షణ ప్రభావంతో సస్పెన్షన్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం సాయంత్రం తెలిపారు
.

# తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

## రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులకు తెలంగాణ రెడ్డి సంఘం ఫిర్యాదు

**, (ప్రజా జ్యోతి):**

రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ శాసనమండలి సభ్యుడు చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రెడ్డి సంఘం ప్రతినిధులు మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రి సభ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కుటుంబంతో పాటు రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో రెడ్డి సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయని, తమను అవమానించినట్లుగా భావిస్తున్నామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.సామాజిక వర్గాలను ఉద్దేశించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజంలో వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, వ్యాఖ్యలు నిజమని తేలితే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘం సభ్యులు మల్లారెడ్డి, ఆర్. కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డి, పి. మధుసూదన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆలయాల అభివృద్ధికి అండగా.. విద్యార్థులకు స్ఫూర్తిగా డా. వెన్న ఈశ్వరప్ప

## అమ్లికుంటలో ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం.. సాల్వీడ్‌లో విద్యార్థులకు మార్గదర్శనం

**కుల్కచర్ల, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**



బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్ప ఒకవైపు ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ, మరోవైపు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుండుమాల్ మండలం అమ్లికుంట గ్రామంలో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో డా. వెన్న ఈశ్వరప్ప పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం తన సొంత నిధుల నుంచి రూ.1 లక్ష విరాళంగా ప్రకటించారు. దేవాలయాల అభివృద్ధికి తోడ్పడటం, ధర్మ పరిరక్షణకు కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.అదేవిధంగా కుల్కచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన మోటివేషనల్ కార్యక్రమంలో పాల్గొన్న డా. వెన్న ఈశ్వరప్ప విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. "చదువే మీ భవిష్యత్తును మార్చే ఆయుధం" అని పేర్కొంటూ పేదరికం పుట్టుకతో వచ్చినా, పట్టుదలతో దానిని అధిగమించవచ్చని అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా పరిగి జోనల్ స్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 8వ తరగతి విద్యార్థిని కే. లావణ్యను శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం సాల్వీడ్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన యజ్ఞ కార్యక్రమంలో కూడా డా. వెన్న ఈశ్వరప్ప పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు టీ. విజయ్ కుమార్, సురేష్, బాల్ రెడ్డి, ఈశ్వరయ్య, వీరభద్రప్ప, వెంకటేష్, విక్రమ్ రెడ్డి, బీజేవైఎం నాయకులు గడుసు మహిపాల్, యాదయ్య గౌడ్, ఆలయ పూజారి విజయ్, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, భక్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డీజేలకు అనుమతి లేదు - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీఐ రాంలాల్






**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

మక్తల్ టౌన్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో మక్తల్, ఉట్కూర్, మాగనూర్, కృష్ణ మండలాలలి పరిధిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, గ్రామ పెద్దలతో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ రాంలాల్ రాథోడ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వైర్ల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గణేష్ మండపం వద్ద ఇద్దరు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మక్తల్ ఎస్ఐ రాజు,మాగనూర్ ఎస్ఐ అశోక్ బాబు, కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం. నవీద్, రమేష్, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసును చేదించిన పోలీసులు

- మహబూబ్నగర్ రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇంట్లో ఆయుధాలు స్వాధీనం
- బుల్లెట్ అందించే అవెన్షన్ సెక్షన్ ఇంచార్జ్ పైనే అనుమానాలు
- ఉడిమిళ్ళ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ రాజు ( అలియాస్ మల్లేష్) సూత్రధారి
- నల్లమల్ల ప్రాంతంలో ఆయుధాల చోరీ కేసు కలకలం రేపింది

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**



మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ, కేసును మహబూబ్నగర్ రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇంట్లో ఆయుధాలు స్వాధీనం చేసుకున్న సంఘటన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. పూర్తి వివరాల మేరకు ఇలా ఉన్నాయి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర మండలంలోని ఉడిమిళ్ళ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ రాజు( అలియాస్ మల్లేష్) గా గుర్తించి సూత్రధారిని అదుపులోకి తీసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా గత నెల 30 తేదీన బొల్లారంలో ఆయుధాలు చోరీ అయినట్టు నిర్ధారించిన వివిధ శాఖల పోలీస్ సిబ్బంది, అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి, సంచలనం రేపిన మద్రాస్ ఆయుధాల చోరీ ఘటనను చేదించడం జరిగింది. బుల్లెట్ అమ్మేషియన్ సెక్షన్ ఇన్చార్జి పైన అనుమానాలతో ఆయుధాల చోరీ సంఘటనలు చేదించడం జరిగిందని సంబంధిత ఉన్నతాధికారులు పేర్కొన్నారు. మహబూబ్నగర్ కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఇంట్లో ఆయుధాలైన నాలుగు ఏకే 47 రైఫిల్స్ రెండు రైఫిల్స్ 9 పిస్టోల్స్ 2000 కు పైగా బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రధాన సూత్రధారి రాజు అలియాస్ మల్లేష్ అచ్చంపేట పట్టణ కేంద్రంలో సాయి నగర్ కాలనీలో నివాసం ఉంటుండగా, తల్లి మరణాంతరం తండ్రి నారాయణ వద్దకు అచ్చంపేటలో రాకపోకలు సాగిస్తున్నట్టు విశ్వసనీయమైన సమాచారం. ఇతనికి నాగర్కర్నూల్ కేంద్రంలో నూతన గృహ నిర్మాణం చేపట్టుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో నల్లమల్ల ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మల్లేష్ ఉండడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఈ ఆయుధాలు ఎందుకు చోరీ చేసినట్లు ప్రశ్నార్థకంగా మారింది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## గూడెం బాధిత కుటుంబానికి వంట సామగ్రి వితరణ

### -బెక్కెం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుల మానవతా దృక్పథం..

### అండగా నిలిచిన హెచ్ఎం విజయవర్ధిని

**చిన్నంబావి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)**



విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన కుటుంబానికి బెక్కెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అండగా నిలిచారు. చిన్నంబావి మండలం గూడెం గ్రామానికి చెందిన రొడ్డ బిచ్చన్న ఇంట్లో నాలుగు రోజుల క్రితం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ ప్రమాదంలో బిచ్చన్న తీవ్రంగా గాయపడగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బెక్కెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం విజయవర్ధిని ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అనిత, రాధమ్మ, సంజీవ్, స్వామి, రవి గూడెం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.బిచ్చన్న మనవళ్లు బెక్కెం పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులు కావడంతో కుటుంబ పరిస్థితిని చూసి ఉపాధ్యాయులు చలించిపోయారు. ఇంట్లో వంట పాత్రలు సైతం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా హెచ్ఎం విజయవర్ధిని మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. బాధిత కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు.అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బిచ్చన్న కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించడంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు

